# ఏం చోద్యం!

నాగుల చవితినాటి తెల్లవారు ఝామునే మా శ్రీమతి లేచి చలివిడి చిమ్మిలి తయారుచేసి పుట్టలో పాలు పొయ్యడానికి సిద్ధమైంది. మా పిల్లలిద్దరూ ఆ మిషతే పుట్ట దగ్గర టపాకాయలు కాల్చవచ్చని సంబరపడిపోయారు.

గబగబా స్నానం చేసి పట్టుబట్టలు కట్టుకుని మా శ్రీమతిని అనుసరించాను.

ఓ పొలం గట్టుని కొన్ని పాముపుట్టలున్నాయి. అందులో ఓ పుట్ట దగ్గర మా శ్రీమతి ఆగింది. పూలసజ్జలోంచి ముగ్గుతీసి పుట్ట చుట్టూ ముగ్గులు పెట్టి వత్తి తీసి ప్రమిదలో నూనెపోసి వెలిగించింది. మా పిల్లలు తెచ్చిన టేప్ రికార్డర్ ఆన్ చేసారు. 'నాగరాజా... నాగప్పా... నాగరాజా' వంటి పాటలు వినిపిస్తున్నాయి. మా శ్రీమతి తనతో తెచ్చిన చలిమిడి ముద్ద, నువ్వుల పప్పుతో చేసిన చిమ్మిలి, ఓ కోడిగుడ్డు, ఇన్ని పాలు పుట్టలో పోసి రికార్డులు వింటూ పుట్టకు దండం పెట్టింది. మా పిల్లలు ఆనందంగా మతాబాలు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు వెలిగించారు. తాటాకు టపాకాయలు కాల్చారు.

మా శ్రీమతి చేసిన పూజలకు ఆ నాగరాజు ప్రసన్నుడయ్యాడు. బుసలు కొడుతూ పుట్టలోంచి బయటకొచ్చాడు. "అమ్మో పాము" అంటూ మా పిల్లలు భయపడి పారిపోయారు. మా శ్రీమతి "బాబోయ్ పాము... రక్షించండి" అంటూ చుట్టుప్రక్కల పూజలు చేస్తున్న వాళ్లని కేకేసింది. వాళ్లు ఝామ్మని వచ్చి నాగరాజు బుర్రమీద నాలుగు బాదులు బాదారు.

నాగరాజు తన ప్రాణం కోసం విలవిలా కొట్టుకుని కైలాసగిరి మీద తపస్సు చేసుకుంటున్న పరమశివుని జటాజూటంలో ఆశ్రయం పొందాడు.

నాగులచవితినాడు ఏ దేవుని 'రక్షణ' కోరుకుంటామో ఆత్మ 'రక్షణ' కోసం ఆ దేవుణ్ణే చావబాదుతున్నాం!

ఆహో... ఏం చోద్యం!



ఆంధ్రభూమి వీక్లీ 7-8-97